క్లుప్తంగా

ప్రతిభ ఉంటే ఏదైనా సాధించవచ్చు



విద్యార్థినులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

జగిత్యాల: విద్యార్థినులు ప్రతిభ ఉంటే ఏదైనా సాధించవచ్చని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణ అన్నారు. బుధవారం సీపీగేట్ 2023 పీజీ ప్రవేశ ఫలితాల్లో అత్యున్నత ర్యాంకులు సాధించిన విద్యార్థినులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా డిగ్రీ కళాశాలలో చదువుతున్న విద్యార్థినులు పీజీలో సౌందర్య, శైలజ, రమ్య, మహేశ్వరి అత్యుత్తమ ర్యాంకులు సాధించడం కళాశాలకు గర్వకారణమన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సుల్తానా, ఐక్యూ ఏసీ కో–ఆర్డినేటర్ హర్‌జ్యోత్‌కౌర్, అకాడమీ కో–ఆర్డినేటర్ జ్యోతిలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని చిత్రపటానికి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు

జగిత్యాలటౌన్: పేద,మధ్య తరగతి కుటుంబాలను దృష్టిలో ఉంచుకుని వంటగ్యాస్ సిలిండర్ ధరపై రూ.200 తగ్గించినందుకు బుధవారం జిల్లా కేంద్రంలోని తహసీల్ చౌరస్తాలో ప్రధాని మోదీ చిత్రపటానికి బీజేపీ నాయకులు క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర నాయకులు ముదుగంటి రవీందర్ రెడ్డి మాట్లాడుతూ పేద, మధ్య తరగతి కుటుంబాలపై ఆర్థిక భారం తగ్గించిన ప్రధాని మోదీకి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఏసీఎస్ రాజు, సీపెల్లి రవీందర్, లింగంపేట శ్రీనివాస్, కౌన్సిలర్ గుర్రం రాము, అరవ లక్ష్మి, విద్యాఠాకూర్, భగవంతరావు, చంద్రశేఖర్‌రావు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ టీచర్ల సమ్మె నోటీస్

పెగడపల్లి: తమ సమస్యలు పరిష్కరించకుంటే సెప్టెంబర్ 11 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా నిరవధిక సమ్మె చేపడుతామని సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం అంగన్‌వాడీ టీచర్లు తహసీల్దార్ ఎంఏ ఫరూక్‌కు నోటీస్ అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం అంగన్‌వాడీ టీచర్లకు గ్రాట్యూటీ చెల్లించాలన్నారు. అలాగే ప్రభుత్వ టీచర్లతో సమానంగా వేతనం, పెన్షన్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత కల్పించాలని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకుడు రాజయ్య, అంగన్‌వాడీ టీచర్ల సంఘం మండల నాయకులు పాల్గొన్నారు.

ప్రత్యేక ఓటరు నమోదును వినియోగించుకోవాలి

కథలాపూర్: శుక్ర, శనివారాల్లో ఓటరు నమోదుకు గ్రామాల్లో స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నామని, ప్రజలు వినియోగించుకోవాలని కథలాపూర్ తహసీల్దార్ ముంతాజీబొద్దిన్ కోరారు. బుధవారం కథలాపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఓటు హక్కు నమోదుపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. సెప్టెంబర్ 1, 2 తేదీల్లో ప్రతీ బూత్‌లో అధికారులు అందుబాటులో ఉంటారన్నారు. ప్రజలు ఓటరు జాబితాలో తమ పేరు ఉందో లేదో చూసుకోవాలన్నారు. తప్పులుంటే సరిచేసుకోవాలన్నారు. 18 ఏళ్లు నిండినవారు కొత్తగా ఓటు కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గౌసుర్ రహమాన్, ఆర్ఐ నాగేశ్ తదితరులు ఉన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి

రాయికల్: సీజనల్ వ్యాధుల దృష్ట్యా పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ మోర హన్మండ్లు తెలిపారు. బుధవారం రాయికల్ మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ మోర హన్మండ్లు అధ్యక్షతన సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో 16 అంశాలను ఏకగ్రీవంగా తీర్మానించారు. సమావేశంలో కౌన్సిలర్లు మారంపల్లి సాయికుమార్, తురగ శ్రీధర్‌రెడ్డి, మహేశ్‌గౌడ్, శ్రీరాముల సువర్ణ, మ్యాకల అనురాధ, కో–ఆప్షన్ సభ్యులు, మేనేజర్ వెంకట్, ప్రసాద్ పాల్గొన్నారు.

వడ్డెరలను ఎస్టీ జాబితాలో చేర్చాలి

మేడిపెల్లి: వడ్డెరలను ఎస్టీ జాబితాలో చేర్చాలని నాయకులు అన్నారు. మండల కేంద్రంలోని పీఎస్ఆర్ గార్డెన్‌లో బుధవారం వడ్డెర సంఘం నాయకులు సమావేశం నిర్వహించున్నారు. అనంతరం తమ డిమాండ్లు నెరవేర్చాలని మండల తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు బొంతల శివ, రాంబాబు, వెంకటేశ్, శేఖర్, నరేశ్ పాల్గొన్నారు.

ముందస్తు రాఖీ వేడుకలు



కథలాపూర్‌లో రాఖీ వేడుకలు

జగిత్యాల/కోరుట్ల/సారంగాపూర్/మెట్‌పల్లి రూరల్/కథలాపూర్/మల్యాల/రాయికల్/మేడిపెల్లి/ధర్మపురి/గొల్లపల్లి: జిల్లాలోని పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో బుధవారం ముందస్తు రాఖీ వేడుకలు ఘనంగా జరిగాయి. పాఠశాలల్లో విద్యార్థులకు విద్యార్థినులు రాఖీలు కట్టి సంబురాలు జరుపుకున్నారు. వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. విద్యార్థులు సోదరభావంతో మెలగాలని పలువురు సూచించారు.



గొల్లపల్లి మోడల్ స్కూల్లో రక్షాబంధన్ వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు



మల్యాల: లాస్య స్కూల్‌లో చిన్నారుల వేడుకలు



ధర్మపురిలో రాఖీలు కట్టుకుంటున్న చిన్నారులు

విద్యార్థులు ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన పెంచుకోవాలి

జగిత్యాలక్రైం: విద్యార్థులకు ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పిస్తున్నట్లు సీఐ రఫీక్‌ఖాన్ అన్నారు. బుధవారం ట్రాఫిక్ శిక్షణ కేంద్రంలో నవ్య బాలికల జూనియర్ కళాశాల విద్యార్థులకు ట్రాఫిక్ నియమాలు, ట్రాఫిక్ గుర్తులు, రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు విద్యార్థి దశ నుంచే ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. రోడ్డుపై నడిచేటప్పుడు ట్రాఫిక్ సిగ్నల్స్ పాటిస్తూ రోడ్డుకు ఎడమవైపు నడవాలని సూచించారు. మైనర్లు వాహనాలు నడపరాదని, నడిపితే చట్టరీత్యా చర్యలు తీసుకోడతాయన్నారు. కార్యక్రమంలో ఆర్ఎస్సై కృష్ణ,



విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

ట్రాఫిక్ ఎస్సై రాంచంద్రం, హెడ్‌కానిస్టేబుల్ ఖలీద్, ట్రాఫిక్ సిబ్బంది, కళాశాల ప్రిన్సిపల్ ఈశ్వర్‌కుమార్, కరస్పాండెంట్ శ్రీపాద నరేశ్, అధ్యాపకులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచుల సమస్యలు పరిష్కరించాలి

జగిత్యాలటౌన్: 5ఏళ్ల పాటు ప్రజాసేవకే అంకితమై గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా పనిచేసిన మాజీ సర్పంచులకు పింఛన్ సౌకర్యం కల్పించాలని బీజేపీ జగిత్యాల నియోజకవర్గ ఇన్‌చార్జి మదన్‌మోహన్ డిమాండ్ చేశారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జగిత్యాల ఆర్డీవో కార్యాలయం సమీపంలో మాజీ సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షుడు మచ్చ నారాయణ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్ష చేపట్టగా మదన్‌మోహన్ సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా మదన్‌మోహన్, మచ్చ నారాయణ మాట్లాడుతూ మాజీ సర్పంచులకు డబుల్‌బెడ్‌రూం ఇళ్లు ఇవ్వాలని, నెలకు పది వేల పెన్షన్, హెల్త్ కార్డు, భూమిలేని పేద మాజీ సర్పంచులకు 2 ఎకరాల వ్యవసాయ భూమి ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీక్ష



రిలే నిరాహార దీక్షలో మాజీ సర్పంచులు

లో మాజీ సర్పంచులు ఎన్నం కిషన్‌రెడ్డి, రెబ్బాస్ మల్లయ్య, సీపెల్లి లచ్చయ్య, కటుకం గంగాధర్, పెంచి పెద్ద మల్లయ్య, మామిడాల గంగాధర్, ఉరుమడ్ల నర్సయ్య పాల్గొన్నారు.

‘పసుపు బోర్డు హామీ ఏమైంది?’

మెట్‌పల్లి రూరల్: పసుపు బోర్డు తెస్తానని హామీ ఇచ్చి మాట తప్పిన ఎంపీ అర్వింద్‌కు గ్రామాల్లో పిండ ప్రదానం చేస్తామని బీఆర్ఎస్ మెట్‌పల్లి మండల ప్రధాన కార్యదర్శి రాజారెడ్డి అన్నారు. కొండ్రికర్లలో బీఆర్ఎస్ నేతలు బుధవారం మాట్లాడారు. ఎన్నికల ముందు పసుపు బోర్డు తెస్తానని బాండ్ పేపర్ రాసిచ్చిన ఎంపీ ఇప్పుడు ఆ ఊసే ఎత్తడం లేదన్నారు. ఎంపీటీసీ ఎన్నికల్లో తమ గ్రామ శివారులో వంతెన నిర్మిస్తామని ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు బాండ్ రాసిచ్చారని, ఇచ్చిన మాట ప్రకారం వంతెన కోసం నిధులు మంజూరు చేయించి పనులకు శంకుస్థాపన చేశారన్నారు.బీజేపీ నాయకులకు రాజకీయాల మీద ఉన్న ధ్యాస అభివృద్ధిపై లేదన్నారు.అలాగే తమ గ్రామ సర్పంచ్,ఉపసర్పంచ్,మాజీ ఉపసర్పంచ్‌లు నిధుల విషయంలో అవగాహన లేకుండా మాట్లాడుతున్నరన్నారు. రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి సంజయ్‌ను ఎమ్మెల్యేగా గెలిపించుకుంటామని ఏకగ్రీవ తీర్మానం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు రమేష్, అశోక్, నర్సయ్య, చిన్నగంగాధర్, పెద్దగంగారాం, ఆశలు, లింగం, రవి, సురేశ్ పాల్గొన్నారు.

అధిక మెజారిటీతో గెలిపిస్తాం

ఇబ్రహీంపట్నం: రానున్న ఎన్నికల్లో కోరుట్ల నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థిగా సురభి నవీన్‌కుమార్‌కు టికెట్ వస్తే భారీ మెజారిటీతో గెలిపిస్తామని బంజార మహిళలు అన్నారు. మండలంలోని డబ్బా గ్రామంలో బుధవారం గడప గడపకు బీజేపీ కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో నరేంద్రమోడీ చేసిన అభివృద్ధిని గ్రామస్తులకు వివరించారు. స్థానిక సేవాలాల్ ఆలయంలో బంజారా మహిళలు సురభి నవీన్‌కుమార్‌కు రాఖీ కట్టారు. కార్యక్రమంలో బీజేపీ కోరుట్ల నియోజకవర్గ కన్వీనర్ చెట్లపల్లి సుకేందర్‌గౌడ్, ఎస్సీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి బత్తుల శ్రీనివాస్, బూత్ అధ్యక్షుడు మల్లేశ్, శక్తి కేంద్ర ఇన్‌చార్జి నరేశ్ యాదవ్, బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి రణధీర్, ఎస్టీ మోర్చా మండల అధ్యక్షుడు రాజేందర్, నాయకులు పాల్గొన్నారు.

యువత సన్మార్గంలో ముందుకెళ్లాలి

మల్లాపూర్: యువత, విద్యార్థులు సన్మార్గంలో ముందుకెళ్లాలని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం పిన్నంశెట్టి శ్రీనివాస్ అన్నారు. మండలంలోని చిట్టాపూర్ జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు బుధవారం స్పోర్ట్స్ టీ–షర్టు(జెర్సీ)లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత, విద్యార్థుల మానసిక వికాసానికి క్రీడలు దోహదపడుతాయని, చదవుతో పాటు క్రీడల్లోను రాణించాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ సాయికుమార్, ఎంపీటీసీ మైస లక్ష్మి, ప్యాక్స్ చైర్మన్ నేరేళ్ల మోహన్‌రెడ్డి, ఉపసర్పంచ్ నవీన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కోళ్ల పెంపకంతో ఆదాయం

పెగడపల్లి: కోళ్ల పెంపకం ద్వారా గిరిజన రైతులు ఆర్థికంగా బలపడటం కోసం ఎస్టీ సబ్ ప్లాన్ ద్వారా ఉచితంగా రాజశ్రీ కోడి పిల్లలను పంపిణీ చేస్తున్నట్లు శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. మండలంలోని ఏడుమోటలపల్లి, రాజరాంపల్లి, మద్దులపల్లి తండాలకు చెందిన గిరిజన రైతులకు పీవీ నర్సింహారావు పశువైద్య విశ్వ విద్యాలయం ద్వారా 50 యూనిట్ల రాజశ్రీ కోడి పిల్లలను బుదవారం ఉచితంగా పంపిణీ చేశారు. పెరటి తోటల్లో కోళ్లను పెంచుకోవడం ద్వారా అదనపు ఆదాయం సమకూర్చు కోవచ్చని శాస్త్రవేత్తలు సూచించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు అనిల్‌కుమార్, రవికుమార్, వినయశ్రీ, మాధవరావు, ఎంపీపీ శోభ, సర్పంచులు శ్రీనివాస్, రవినాయక్, ఏఎంసీ మాజీ చైర్మెన్ తిరుపతినాయక్, ఏఎంసీ వైస్ చైర్మెన్ అంజి, డైరెక్టర్ సత్యనారాయణరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

వరద బాధితులకు నిత్యావసర సరుకులు పంపిణీ

కోరుట్ల: పట్టణంలోని లయన్స్ క్లబ్ ఆఫ్ కోరుట్ల, లయన్స్ క్లబ్ కోటి నవదుర్గ ఆధ్వర్యంలో వరద బాధితులకు బుధవారం బియ్యం, నిత్యావసర వస్తువులను పంపిణీ చేశారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పట్టణంలో పలు ఇండ్లు వరదబారిన పడి నష్టం వాటిల్లింది. దీంతో 50 మందిని గుర్తించి ఒక్కొక్కరికి రూ. 3 వేల విలువ గల సామాగ్రి పంపిణీ చేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ లయన్ అనుమండ్ల రాజిరెడ్డి, ఉప గవర్నర్ సింహంరాజు కోదండరాం, జిల్లా కేబినెట్ సెక్రటరీ రమణారెడ్డి, కోరుట్ల అధ్యక్షుడు వనపర్తి చంద్రమోహన్, కోటి నవదుర్గ అధ్యక్ష, కార్యదర్శులు రమ్య, ప్రేమలత, రాధిక, నాయకులు పాల్గొన్నారు.

మాదిగ రాజకీయ పోరాట సమితి అధ్యక్షుడిగా సునీల్

సారంగాపూర్: మాదిగ రాజకీయ పోరాట సమితి సారంగాపూర్ మండల అధ్యక్షుడిగా దాసరి సునీల్ నియమితులయ్యారు. బుధవారం మండల కేంద్రంలో మాదిగ రాజకీయ పోరాట సమితి కార్యవర్గాన్ని నియమించారు. సీనియర్ కార్యవర్గ సభ్యులుగా బిరుదుల లక్ష్మణ్, చాతరాసి లక్ష్మీరాజం, కార్యవర్గ సభ్యులుగా తిరుపలెల్లి మల్లేశ్, లచ్చయ్య, మల్లయ్య తదితరులు నియమితులయ్యారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు చెవులమద్ది శ్రీనివాస్, జిల్లా అధికార ప్రతినిధి దూమాల గంగారాం మాదిగ పాల్గొన్నారు.

యువతి ఆత్మహత్య

కోరుట్ల రూరల్: మున్సిపల్ పరిధిలోని యెఖీన్‌పూర్ గ్రామానికి చెందిన ఉయ్యాల రజిత(37) అనే మహిళ బుధవారం సాయంత్రం ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుని మృతి చెందింది. స్థానికుల కథనం ప్రకారం రజిత తన ఇంటి ముందు నిర్మిస్తున్న గద్దెల విషయంలో పక్కింటి వారితో గొడవ జరిగింది. దీంతో మున్సిపల్‌లో ఫిర్యాదు చేయటంతో అధికారులు వచ్చి పరిశీలించారు. దీంతో మనస్తాపానికి గురైన రజిత ఇంట్లోకి వెళ్లి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. తనను పక్కింటి వారు చంపేస్తానని బెదిరించారని, తన చావుకు వారే బాధ్యులని సూసైడ్ నోట్ రాసింది. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. రజిత భర్త శ్రీనివాస్ సౌదీలో ఉండగా, వీరికి ఓ కుమారుడు ఉన్నాడు.

ఉరేసుకుని వృద్ధుడి ఆత్మహత్య

మల్లాపూర్: మండల కేంద్రానికి చెందిన బద్దం అంతయ్య(65) అనే వృద్ధుడు బుధవారం ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని ఎస్సై నవీన్‌కుమార్ తెలిపారు. అంతయ్య గత కొన్నేళ్లుగా తాగుడుకు బానిసై అనారోగ్యంతో బాధపడుతున్నాడు. బుధవారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో ఇంట్లో నుంచి బయటకు వెళ్తున్నానని చెప్పి వెళ్లి పశువుల కొట్టంలో ఉరిపెట్టుకుని చనిపోయాడన్నారు. మృతుడి భార్య రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

బీపీఎం కుటుంబానికి పరామర్శ

మల్లాపూర్: మండల కేంద్రంలోని బ్రాంచ్ పోస్టాపీస్ బీపీఎం కొండలాద్రి గుండెపోటుతో మృతి చెందగా, బుధవారం బాధిత కుటుంబాన్ని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కల్వకుంట్ల సంజయ్‌కుమార్, ధర్మపురి ఆలయ కమిటీ మాజీ చైర్మన్, పీసీసీ నాయకులు జువ్వాడి కృష్ణారావు, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు బద్దం గంగాధర్‌రెడ్డి వేర్వేరుగా పరామర్శించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సందిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీపీ కాటిపెల్లి సరోజన, మాజీ ఎంపీపీలు నల్ల రాజన్న, ముద్దం విమల, కాంగ్రెస్, బీజేపీ మండల అధ్యక్షులు పూండ్ర శ్రీనివాస్‌రెడ్డి, ముద్దం సత్యనారాయణగౌడ్, తదితరులు కుటుంబాన్ని పరామర్శించారు.

యాదవ సంఘ భవనానికి నిధులు మంజూరు



మంజూరు పత్రాన్ని అందిస్తున్న మంత్రి ఈశ్వర్

పెగడపల్లి: మండలంలోని రాములపల్లి శివారు గ్రామం రామ్‌నగర్‌లో యాదవ సంఘం భవనం నిర్మాణానికి రూ. 5 లక్షలు మంజూరు కాగా, ప్రొసీడింగ్ పత్రాన్ని బుధవారం కరీంనగర్‌లోని మంత్రి క్యాంపు కార్యాలయంలో యాదవ సంఘం నాయకులకు అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు శ్రీనివాస్, విష్ణువర్ధన్, శ్రీనివాస్‌రావు, తిరుపతి, మల్లయ్య, బాలయ్య, రాయమల్లు, రాజయ్య, ఎల్లయ్య, కనుకయ్య, నర్సయ్య, గంగయ్య పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లకు ప్రణాళిక



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ లత

జగిత్యాల: 2023–24 వానాకాలం సీజన్‌కు సంబంధించి ధాన్యం కొనుగోళ్లకు ప్రణాళిక రూపొందించాలని అదనపు కలెక్టర్ లత ఆదేశించారు. బుధవారం తన కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. జిల్లాలో ఐకేపీ ద్వారా 104, పీఏసీఎస్ ద్వారా 271, మెప్మా ద్వారా ఒకటి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు పంపించామన్నారు. జిల్లాలో రా రైస్‌మిల్లులు 66, బాయిల్డ్ రైస్‌మిల్లులు 69 ఇందులో పాల్గొంటాయని అన్నారు. ఈ సమావేశంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఐఎంఏ భవన నిర్మాణానికి భూమిపూజ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే విద్యాసాగర్ రావు

కోరుట్ల: పట్టణ శివారులోని వెటర్నరీ కళాశాల వద్ద కోరుట్ల ఐఎంఏ నూతన భవన నిర్మాణానికి ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావు బుధవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కోరుట్లలో ఐఎంఏ భవన నిర్మాణం జరుగటం చాలా సంతోషదాయకం అన్నారు. డాక్టర్లందరూ ఒకే చోట కలుసుకునేందుకు ఇదొక చక్కని వేదికగా ఉపయోగ పడుతుందన్నారు. కార్యక్రమంలో కల్వకుంట్ల సంజయ్, మున్సిపల్ చైర్మన్లు అన్నం లావణ్య, రానవేని సుజాత, డీఎంహెచ్‌వో డాక్టర్ పుప్పాల శ్రీధర్, ఐఎంఏ స్టేట్ ప్రెసిడెంట్ డాక్టర్ బీఎన్ రావు, స్టేట్ కౌన్సిల్ మెంబర్ డాక్టర్ అనూప్ రావు, కోరుట్ల అధ్యక్షుడు డాక్టర్ రేగొండ రాజేశ్, డాక్టర్లు పాల్గొన్నారు.

ప్రభుత్వ షోకాజ్ నోటీసులకు భయపడం



ర్యాలీలో పాల్గొన్న రెండో ఏఎన్ఎంలు

జగిత్యాలటౌన్: ప్రభుత్వపు బెదిరింపు షోకాజ్ నోటీసులకు భయపడేది లేదని తమ హక్కులు సాధించుకునే వరకు శాంతియుతంగా సమ్మె కొనసాగిస్తామని 2వ ఏఎన్ఎంల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గాండ్ల మధురిమ స్పష్టం చేశారు. తమ ఉద్యోగాలను క్రమబద్ధీకరించి, భద్రత కల్పించాలని కోరుతూ 2వ ఏఎన్ఎంలు చేస్తున్న చేస్తున్న సమ్మె బుదవారం 15వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఏఎన్ఎంలు తహసీల్ చౌరస్తాలో ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో గోబ్యాక్ షోకాజ్ నోటీస్ అంటూ ముద్రించి ఉన్న ప్లకార్డులను ప్రదర్శించారు. రాఖీ పండుగను పురస్కరించుకుని జగిత్యాల జిల్లా వైద్యాధికారి పుప్పాల శ్రీధర్‌కు ఏఎన్ఎంలు రాఖీ కట్టారు. కార్యక్రమంలో గూడూరి జయప్రద, నీరజ, పద్మ, ఎలిజబెత్, ఊర్మిళ, శిరీష, మేరీ, శారద, శిరీష, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

నాణ్యమైన విద్య అందించాలి

జగిత్యాల: విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలని డీఈవో జగన్మోహన్‌రెడ్డి సూచించారు. బుధవారం జిల్లాలోని ఉపాధ్యాయులకు ఉన్నత అభ్యాసన అభివృద్ధి కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ, ప్రతీఉపాధ్యాయుడు ఉన్నత పాఠశాల విద్యార్థుల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. విద్యార్థులు వారి స్థాయికి తగిన సామర్థ్యాలు సాధించేలా తర్ఫీదు ఇవ్వాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో సమన్వయకర్త రాజేశ్ పాల్గొన్నారు.

మహిళలు అన్నిరంగాల్లో రాణించాలి

జగిత్యాల: మహిళలు అన్నిరంగాల్లో రాణించాలని మహిళా సాధికారత కో ఆర్డినేటర్ అశ్విని సూచించారు. స్థానిక ఎస్ఎస్కే డిగ్రీ కళాశాలలో బుధవారం మహిళా సాధికారతపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. మహిళలు తమ హక్కుల గురించి తెలుసుకోవాలన్నారు. తద్వారా భవిష్యత్ నిర్ణయాలు తామే స్వయంగా తీసుకోవాలని చెప్పారు. 18 సంవత్సరాల వయసు నిండిన వారు ఓటుహక్కు పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో సభ్యులు గౌతమి, హేమశ్రీ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

జగిత్యాల: తమ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని, లేనిపక్షంలో సెప్టెంబర్ 11 నుంచి నిరవధిక సమ్మె చేస్తామని అంగన్‌వాడీ టీచర్లు హెచ్చరించారు. బుధవారం జిల్లా సమీకృత కార్యాలయంలోనీ డీడబ్ల్యూవోకు అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఉద్యోగులను పర్మినెంట్ చేయడంతోపాటు, కనీస వేతనం, గ్రాట్యూటీ చెల్లించాలన్నారు. జీవో నంబర్లు 14, 19, 8 సవరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షురాలు రజిత తదితరులు పాల్గొన్నారు.

జనార్దన్‌రెడ్డిపై ఠాణాలో ఫిర్యాదు

జగిత్యాలక్రైం: నాగర్‌కర్నూర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డిపై కాంగ్రెస్ నాయకులు స్థానిక పోలీసుస్టేషన్‌లో బుధవారం ఫిర్యాదు చేశారు. కాంగ్రెస్ శ్రేణులపై చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా పరిగణించి కేసు నమోదు చేయాలని యూత్ కాంగ్రెస్ నాయకులు గుండ మధు, నక్క జీవన్, నేహాల్ పోలీసులను కోరారు.

మొగిపురుగు నియంత్రణపై అవగాహన

మెట్‌పల్లిరూరల్: చౌలమద్ది, ఆరపేట గ్రామాల్లో వివిధ పంటలను ఆశించిన మొగిపురుగు నివారణపై బుధవారం శాస్త్రవేత్తలు రైతులకు అవగాహన కల్పించారు. తొలుత వారు మొక్కజొన్న, పసుపు, సోయా, చిక్కుడు, వరి పంటలు పరిశీలించారు. జిల్లా ఏరువాక కేంద్రం, వ్యవసాయ పరిశోధన స్థానం, కరీంనగర్ శాస్త్రవేత్తలు మాట్లాడారు. వరి మొగిపురుగు లక్షణాలు, దాని నియతంత్రణకు తీసుకోవాల్సిన చర్యల గురించి వివరించారు. వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్తలు మంజులత, శ్రావణి, రాజేంద్రప్రసాద్, ఏఈవో రాజు, రైతులు పాల్గొన్నారు.

ప్రవేశాలకు మరో అవకాశం

జగిత్యాల: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రవేశాల కోసం మరో అవకాశం కల్పించామని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణ బుధవా రం తెలిపారు. ఈనెల 27 నుంచి సెప్టెంబర్ 4వ తేదీ వరకు దోస్త్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకో వాలన్నారు. సెప్టెంబర్ 5 వెబ్‌ఆప్షన్లు ఇచ్చుకోవాలని పేర్కొన్నారు. ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో బీఏ ఇంగ్లిష్ మీడియంలో 13, ఉ ర్దూ మీడియంలో 16, బీకాంలో 34, బీఎస్సీ లైఫ్‌సైన్స్‌లో 42, ఫిజికల్ సైన్స్‌లో 18 సీట్లు ఖాళీ ఉన్నాయని, ఆసక్తిగల విద్యార్థులు ప్రవేశాలు తీసుకోవాలని కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

జగిత్యాల: మల్లాపూర్ మండలంలోని మోడల్‌స్కూల్‌లో బాలికల వసతి గృహంలో కేర్ టేకర్ ఏఎన్ఎం పోస్టుల కాంట్రాక్ట్ పద్ధతిలో భర్తీ చేసేందుకు మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఈవో జగన్మోహన్‌రెడ్డి తెలిపారు.కేర్ టేకర్ పోస్టుకు డిగ్రీ, బీఈడీ, డీఈడీ విద్యార్హత ఉండాలని, ఏఎన్ఎం పోస్టుకు ఇంటర్‌తో పాటు, ఏఎన్ఎం ట్రైనింగ్ సర్టిఫికెట్ ఉండాలన్నారు. దరఖాస్తులను కేజీబీవీ మల్లాపూర్ స్పెషల్ ఆఫీసర్‌కు సెప్టెంబర్ 6 లోపు అందజేయాలని పేర్కొన్నారు.

దివ్యాంగులకు ఉచిత బస్ పాసులు

గొల్లపల్లి: మండలంలోని దట్నూర్‌లో సర్పంచ్ ఆకుల పావని, నగేశ్ ఆధ్వర్యంలో విద్యాంగులకు ఉచిత బస్ పాసులను పంపిణీ చేశారు. ప్రభుత్వం దివ్యాంగులకు రూ.4016 పెన్షన్ అందించడంపై సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కాంపెల్లి హన్మండ్లు, ఉప సర్పంచ్ మీసాల పోషవ్వ, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

ప్రజలంతా సమానంగా జీవించాలి

పెగడపల్లి:ప్రజలంతా సమానంగా జీవించాలని అధికారులు సూచించారు. మండలంలోని ల్యాగలమర్రిలో బుధవారం సివిల్ రైట్స్‌డే నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చట్టం అందరికి సమానమేనని చట్టానికి వ్యతిరేకంగా ప్రవర్తిస్తే శిక్షార్హులు అవుతారని హెచ్చరించారు. కుల వివక్షతను రూపు మాపుటకు ప్రతి ఒకరు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ వనజ, ఎంపీటీసీ అంజయ్య, ఎంపీవో మహేందర్, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్, ఆర్ఐ శ్రీనివాస్, ఉప సర్పంచ్ రవి, దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పథకాలపై ఇంటింటా ప్రచారం

పెగడపల్లి:తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై బుధవారం పెగడపల్లిలో బీఆర్ఎస్ నాయకులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. రైతుబంధు, రైతుబీమా, ఉచిత కరెంటు, ఆసరా పింఛన్లు, గృహలక్ష్మీ తదితర పథకాలను వివరిస్తూ కేసీఆర్ ప్రభుత్వాని అండగా నిలువాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో అధ్యక్షుడు లక్ష్మీనారాయణ మండల ప్రధాన కార్యదర్శి వెంకన్న, నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తా

ధర్మపురి: ధర్మపురి అసెంబ్లీ స్థానం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తానని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు బండారి కనకయ్య తెలిపారు. ధర్మపురి బుధవారం పాత్రికేయుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆల్ ఇండియా ఐఎంటీయూసీ ఎన్టీపీసీ కార్మికుల ఫెడరేషన్ ఉపాధ్యక్షుడితో పాటు నేతకానీ మహర్ హక్కుల కమిటీ జాతీయ అధ్యక్షుడిగా కొనసాగుతూ అందరికి సుపరిచితుడనని తెలిపారు.చెన్నూర్, ధర్మపురి నియోజకవర్గాల్లో నేతకాని సామాజిక వర్గానికి చెందిన వారు అధికంగా ఉన్నారని, వారి కోరిక మేరకే పోటీ చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు పేర్కొన్నారు. అధిష్ఠానం ఎవ్వరికీ టికెట్ ఇచ్చినా సహకరిస్తానని తెలిపారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎస్కు రాజమల్లు, జిల్లా అధ్యక్షుడు గంగరాజం, వర్కింగ్ ప్రెసిడెంట్ దుర్గం రాజమల్లయ్య తదితరులున్నారు.